క్లుప్తంగా

రైతుల సేవలపై సమీక్ష



మండవల్లి: ప్రస్తుత వ్యవసాయ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇన్‌పుట్స్‌పై జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా గన్నవరంలో గురువారం సమీక్ష జరిపారు. గ్రామంలోని రైతుసేవాకేంద్రం నందు బ్యాంకుల నుంచి పంట రుణాలు, పంటల బీమా, కౌలు కార్డుల జారీ, కౌలు రైతులకు బ్యాంకు రుణాలు తదితర అంశాలపై సమీక్షించారు. కైకలూరు సబ్ డివిజన్‌లో పనిచేస్తున్న వ్యవసాయాధికారులు(ఏఓ), గ్రామ వ్యవసాయ సహాయకులను(వీఏఏలు) స్థానిక ఏడీఏ జి.వెంకటమణి ఆధ్వర్యంలో సమీక్షించారు. రైతులకు అందించాల్సిన సేవల్లో అలసత్వం చూపవద్దని అధికారులను హెచ్చరించారు.

దివ్యాంగునికి కృత్రిమ కాలు



గుడివాడటౌన్: భారత్ వికాస్ పరిషత్ సేవా కార్యక్రమాల్లో భాగంగా దివ్యాంగునికి కృత్రిమ కాలు ఏర్పాటు చేసినట్లు భారత్ వికాస్ పరిషత్ గుడివాడ అధ్యక్షురాలు తిరుమలశెట్టి హారిక తెలిపారు. 30 ఏళ్ల ఎ.వెంకటేష్ ప్రమాదవశాత్తు కాలు కోల్పోగా కృత్రిమ అవయవానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. వెంకటేష్‌కు కొలతలు తీసుకుని కృత్రిమ కాలు ఏర్పాటుకు సిఫార్సు చేశామన్నారు. సిఫార్సు పత్రాన్ని అందజేయగా వెంకటేష్ హైదరాబాద్ వెళ్లి కృత్రిమ కాలు ఏర్పాటు చేసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ సభ్యులు రూప్‌చంద్ జైన్, డాక్టర్ రాధాకృష్ణ, జి.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మకు బోనాల సమర్పణ



గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు శివారు కొత్తపేటకు చెందిన భక్తులు స్థానిక శ్రీ గంగానమ్మ అమ్మవారికి గురువారం బోనాలను సమర్పించారు. వర్షాలు కురిసి బాగా పంటలు పండాలని కోరుకుంటూ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. దీంతో ఆలయంలో కోలాహలం నెలకొంది.

వడ్డెర రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి



గుడివాడటౌన్: ఆంధ్రప్రదేశ్ వడ్డెర ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి మహాసభలను జయప్రదం చేయాలని సంఘం నాయకులు కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మహాసభల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జూలై 27, 28 తేదీల్లో నెల్లూరులో ఈ మహాసభలు జరుగుతాయన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వడ్డెర కుటుంబాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా పోరాడాల్సిన బాధ్యత వడ్డెర కుటుంబ సభ్యులకే ఉందన్నారు. దీనిపై మహాసభల్లో చర్చిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు సీహెచ్ శివనాగ మల్లేశ్వరరావు, ఆర్.కొండ, బండి శ్రీను, సీహెచ్.రాంబాబు, టి.దుర్గారావు, సీహెచ్. తిరుపతి, ఆర్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు ఏఎంసీ చైర్మన్‌గా త్రినాథరాజు

కైకలూరు: కూటమి పాలనలో ఏడాదిగా పార్టీల మధ్య ఊరిస్తున్న కైకలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎట్టకేలకు ప్రస్తుత మండల టీడీపీ అధ్యక్షుడు, భుజబలపట్నం గ్రామానికి చెందిన పెన్మత్స త్రినాథ రాజుకు దక్కింది. ఈ మేరకు అదిష్టానం నుంచి పేరును గురువారం వెల్లడించారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

ఘనంగా కార్మెల్‌మాత మహోత్సవాలు

పెనమలూరు: మండలంలోని కానూరులో కార్మెల్ మాత మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల ఏడో తేదీ నుంచి నవదిన ప్రార్థనలు ప్రారంభించారు. బుధవారం రాత్రి ఫాదర్ సలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో ఘనంగా మహోత్సవాలను ముగించారు. తొమ్మిది రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో ఫాదర్లు ప్రార్థనల గురించి వివరించారు. చివరి రోజు కార్మెల్‌మాత మహోత్సవ సమష్టి దివ్యబలి పూజలు చేశారు.

సమస్యల వలయంలో గురజాడ

- అధ్వానంగా రహదారులు
- రెయిలింగ్స్ లేని కాలిబాట వంతెన
- జాతీయ రహదారిపై వెలగని వీధిలైట్లు
- సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తుల వినతి



ప్రమాదకరంగా ఉన్న కాలిబాట వంతెన



అధ్వానంగా ఉన్న రహదారి

పమిడిముక్కల: మండలంలోని గురజాడ గ్రామం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. గ్రామంలో రెండు వేలకు పైగా జనాభా, 10 వార్డులు ఉన్నాయి. ఈ గ్రామం ఉయ్యూరుకు సమీపంలో ఉంది. విజయవాడ – మచిలీపట్నం హైవే గ్రామం మధ్యలో నుంచి వెళ్లింది.

ప్రమాదకరంగా కాలిబాట వంతెన...

మంటాడ వైపు నుంచి గురజాడకు వెళ్లేందుకు పుల్లేరు కాలువపై కాలిబాట వంతెన ఉంది. ఈ వంతెన శిథిలావస్థకు చేరింది. ఇరువైపులా రెయిలింగ్స్ లేవు. ప్రమాదకరంగా ఉంది. బైక్‌లు మినహా పెద్ద వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేదు. వంతెన వద్ద కొంత భాగం దెబ్బతినగా గ్రామస్తులు మరమ్మతులు చేసుకొన్నారు. వంతెనకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధ్వానంగా రహదారి...

గ్రామంలోని ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. గుంతలు పడి రాళ్లు లేవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని గ్రామాల వాహనదారులు నేషనల్ హైవే పైకి వెళ్లేందుకు గురజాడ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. రహదారికి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

గురజాడ- మర్రివాడ రోడ్డుకు మోక్షమెప్పుడు ?

గురజాడ నుంచి మర్రివాడ వెళ్లే డొంక రోడ్డు పూర్తిగా దెబ్బతింది. జగనన్న కాలనీకి వెళ్లేందుకు ఇదే రహదారి. గురజాడ, మర్రివాడ రైతాంగానికి ఈ రహదారి ఎంతో ఉపయోగకరం. మర్రివాడ, గోపువానిపాలెం గ్రామాల ప్రజలు ఉయ్యూరు వెళ్లేందుకు దగ్గరి దారి. ఉయ్యూరు కేసీపీకి చెరుకు రవాణాకు ఉపయోగపడుతుంది. ఎంతో ఉపయుక్తమైన ఈ రహదారికి కనీసం రబ్బీస్ కూడా పోయలేదని, రహదారిని అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

జాతీయ రహదారిపై వెలగని వీధిలైట్లు...

గ్రామం మధ్యలో నుంచి నేషనల్ హైవే వెళ్లింది. హైవేపై వీధిలైట్లు వెలగకపోవడంతో అంధకారం అలముకొంది. రాత్రి వేళల్లో వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లు అలముకోవడంతో రాత్రి వేళల్లో బయటకు వెళ్లాలంటే భయమేస్తోందని ప్రజలు తెలుపుతున్నారు. ఏడాదిగా హైవే అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

గురజాడ - మర్రివాడ రోడ్డు అభివృద్ధి చేయండి



గురజాడ – మర్రివాడ రోడ్డును అభివృద్ధి చేయాలని గత కొన్నేళ్లుగా కోరుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. కనీసం రబ్బీష్ కూడా వేయడం లేదు. మూడు గ్రామాలకు, జగనన్న కాలనీకు, రైతులకు ప్రయోగకరమైన రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– రాజులపాటి గురవయ్య, రైతు, గురజాడ

సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



నెలల తరబడి నేషనల్ హైవేపై గురజాడ, తాడంకి, గోపువానిపాలెం ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగకపోవడం వల్ల రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి వేళల్లో విషసర్పాలు సంచరిస్తున్నాయి. గురజాడ నుంచి ఉయ్యూరు సర్వీస్ రోడ్ల మార్జిన్‌ల నిర్వహణ సరిగా లేదు. ఈ సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను.

– జంపాన శ్రీనివాసగౌడ్, మాజీ సర్పంచ్, గురజాడ

సమస్యలను పరిష్కరించాలి



కాలిబాట వంతెన శిథిలావస్థకు చేరింది. బైక్‌లు మినహా పెద్ద వాహనాలు వచ్చేందుకు వీలులేదు. వంతెనకు వెంటనే మరమ్మతులు చేపట్టడంతో పాటు వంతెనను విస్తరించాలి. దీంతో పాటు గ్రామంలో రహదారులు, వీధి లైట్లతో పాటు అనేక సమస్యలు నెలకొన్నాయి. అధికారులు చొరవ చూపి వెంటనే సమస్యలను పరిష్కరించాలి.

– షుకూర్‌ఖాన్, ఉపసర్పంచ్, గురజాడ

తాగునీటి క్లోరినేషన్ పరీక్షలు



గుడ్లవల్లేరు: మండలంలోని విన్నకోటలోని రక్షిత మంచినీటి పథకం వద్ద తాగునీటిలో క్లోరినేషన్ మోతదుపై ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ గురువారం పరీక్షలు చేయించారు. అలాగే వివిధ గ్రామాల్లో ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని బ్రోచర్లను చిరు వ్యాపారులకు అందజేశారు. గ్రామ కార్యదర్శి జె.నరసింహారావు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య, తాగునీటి సరఫరా సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రవర్ణాల దాడులను వ్యతిరేకించండి



గుడివాడటౌన్: రాష్ట్రంలో జూలై 17 ఒక బ్లాక్ డే అని దళిత సంఘాల నాయకులు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో గురువారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కారంచేడులో దళితులపై అగ్రవర్ణాలు దాడులు చేసి అతి క్రూరంగా చంపివేసిన దుర్ఘటన జరిగి 40 ఏళ్లు అయిందన్నారు. దీనిని దళిత సంఘాల జేఏసీ గుర్తుతెచ్చుకుని ఆ దాడులలో మృతుల ఆత్మ శాంతి కలగాలని కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా దళితులు ఐక్యంగా ఉండాలని అగ్రవర్ణాల అణచివేతపై పోరాడాల్సిన అవసరత ఎంతైనా ఉందని జేఏసీ నాయకులు చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు పొంగులేటి జయరాజు, చింతా నాని, రవీంద్ర, దారం కరుణాకర్, శ్రీకాంత్, వాసుపల్లి పండు, పంతగాని సురేష తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్‌కు ఆత్మీయ పలకరింపు



కైకలూరు పార్టీ కార్యాలయం వద్ద బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎన్నార్

కైకలూరు: స్వల్ప అస్వస్థతతో చికిత్స పొంది పూర్తి ఆరోగ్యంగా కైకలూరు చేరుకున్న వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ గురువారం కలిసి యోగక్షేమాలు అడిగారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమానికి వెళుతూ కైకలూరు పార్టీ కార్యాలయం వద్ద బొత్స సత్యనారాయణ ఆగారు. ఆయనకు డీఎన్నార్ పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కైకలూరు మండల పార్టీ అధ్యక్షుడు శింగంశెట్టి రాము, నాయకులు సమయం అంజి, పంజా నాగు పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో డీఎన్నార్‌ను ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్(జేపీ), నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి జాన్ గుర్నాథ్, నగర బీసీ సెల్ అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, దాసరి రమేష్, రాష్ట్ర వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి జీఎంఆర్, యూత్ నాయకులు దాలి వెంకటేష్, బసవ, సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు.

21న వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం



డీఎన్నార్, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు

కైకలూరు: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, కైకలూరు నియోజకవర్గ సమన్వయకర్త దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) గురువారం చెప్పారు. కార్యక్రమానికి పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, పార్లమెంట్ పరిశీలకులు, శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్, ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, ఏలూరు, నూజివీడు, ఉంగుటూరు, పోలవరం, దెందులూరు, చింతలపూడి నియోజకవర్గాల సమన్వయకర్తలు మామిళ్లపల్లి జయప్రకాష్(జేపీ), మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, పుప్పాల వాసుబాబు, తెల్లం బాలరాజు, కొఠారు అబ్బయ్య చౌదరి, కంభం విజయరాజు హాజరవుతారన్నారు. రాష్ట్ర, జిల్లా, నియోజవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై సభను విజయవంతం చేయాలని డీఎన్నార్ కోరారు.

ఆయిల్ పామ్‌తో రైతులకు ఆర్థిక పరిపుష్టి



మొక్కలు నాటుతున్న అధికారులు, రైతులు

కూచిపూడి(మొవ్వ): ప్రకృతి వైపరీత్యాల భయం లేని, పంట నష్టం లేని ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఆర్థికంగా ఎదగవచ్చునని కృష్ణాజిల్లా ఉద్యాన శాఖ అధికారి జె.జ్యోతి పేర్కొన్నారు. మండలంలోని కూచిపూడిలో ఘంటసాల వెంకటరత్నంకు చెందిన 2.916 ఎకరాల పొలంలో గురువారం ఉద్యానవన శాఖ, 3 ఎఫ్ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త నిర్వహణలో పామాయిల్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల ఉద్దేశించి ప్రసంగిస్తూ 193 రూపాయల విలువ గల మొక్క నూరు శాతం రాయితీతో రైతులకు అందిస్తున్నామన్నారు. అలాగే నాలుగేళ్ల పాటు నిర్వహణ (ఎరువులు, నీటి యాజమాన్యం, అంతర్ పంటలు) లో హెక్టారుకు రూ.21,500 రాయితీ లభిస్తోందని చెప్పారు.

సద్వినియోగం చేసుకోవాలి..

ఐదు ఎకరాలలోపు సాగు చేసే ఎస్సీ, ఎస్టీ చిన్న, సన్నకారు రైతులకు నూరు శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. అదేవిధంగా ఓసీ, బీసీ రైతులకు ఒకటి నుంచి ఐదు ఎకరాల వరకు 90 శాతం రాయితీ, 10 నుంచి 12.50 ఎకరాలకు 50 శాతం రాయితీ, ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు ఐదు నుంచి పది ఎకరాలకు వరకు 70 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం లభిస్తోందని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, 3 ఎఫ్ ఆయిల్ ఫామ్ కంపెనీ ఏజీఎం యు.విక్రమ రాజ్, ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ కృష్ణాజిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ రత్నాచార్యులు, ఘంటసాల కేవీకే ఉద్యాన శాస్త్ర విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి, మొవ్వ ఏఎంసీ డైరెక్టర్ డాక్టర్ పోలన అశోక్ కుమార్, పామర్రు ఉద్యాన శాఖ అధికారి జె.కీర్తి దేవ్, రైతులు పాల్గొన్నారు.

పురపాలక సంఘం ఆదాయం పెంచాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

గుడివాడటౌన్: పురపాలక సంఘ పరిధిలో అనేక విధాలుగా పన్ను చెల్లించాల్సినవి ఉంటాయని, వాటిని గుర్తించి పురపాలక సంఘానికి ఆదాయం పెంచాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి సహకారంతో అన్‌ఎస్సెస్‌డ్ పన్ను విధింపు, ఆస్తి పన్ను, ఖాళీస్థలం పన్ను, నీటి కుళాయిల పన్ను అన్ని సక్రమంగా చేరుతున్నదీ లేనిదీ సర్వే నిర్వహించాలన్నారు. ఏవైనా పురపాలక సంఘ నోటీసుకు రాని పక్షంలో వాటిని గుర్తించి అధికారుల దృష్టికి తేవాలన్నారు. వీటితో పాటు ప్రభుత్వం చేపట్టిన పీ–4 సర్వేపై కూడా దృష్టిసారించాలని చెప్పారు.

చావలిపాడు చెరువు సమస్య పరిష్కారం

భారీ పోలీసు బందోబస్తు మధ్య గట్టు ఏర్పాటు



పోలీసుల సమక్షంలో చెరువుకు గట్టు ఏర్పాటు

మండవల్లి(కైకలూరు): తోకల చెరువుగా పిలవబడే చావలిపాడు సొసైటీ చెరువు వివాదం ఎట్టకేలకు గురువారంతో సమసింది. ఇరు వర్గాలు ఘర్షణ పడే అవకాశం ఉండటంతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సొసైటీ చెరువులో 5 ఎకరాలు తాగునీటి చెరువు నిమిత్తం గట్టు పనులు అధికారుల సమక్షంలో ప్రారంభించారు. చెరువు వివాదంపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చావలిపాడు గ్రామంలో 2.5 ఎకరాల్లో తాగునీటి చెరువు ఉంది. గ్రామంలో జనాభా 1,450 మంది ఉన్నారు. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా ప్రస్తుత తాగునీటి చెరువు సరిపోవడం లేదు. ఇదిలా ఉంటే గ్రామంలో సర్వే నంబరు 89లో పంచాయతీ లెక్కల ప్రకారం 13.5 ఎకరాల విస్తీర్ణంలో తోకల చెరువును సొసైటీగా 28 మంది సభ్యులు అనేక సంవత్సరాలుగా సాగు చేస్తున్నారు. అనధికారికంగా 18.5 ఎకరాలు చెరువు విస్తీర్ణం ఉన్నట్లు అంచనా. లీజు సొమ్మును పంచాయతీకి చెల్లిస్తున్నారు. ఇటీవల ఈ చెరువు 40 సంవత్సరాల సాగు లీజు కాలం సైతం ముగిసిందని అధికారులు చెప్పారు.

వివాదం ఇదీ..

సొసైటీ చెరువులో 5 ఎకరాలు గ్రామ తాగునీటి చెరువుకు కేటాయించాలని గ్రామస్తులు 2023లో కోరారు. సొసైటీ సభ్యులు మా ఉపాధి పోతుందని ఇక్కడ చెరువులో కాకుండా మరో ప్రాంతంలో తాగునీటి చెరువుకు స్థలం కేటాయించాలని చెప్పారు. దీంతో సొసైటీ సభ్యులు, గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో 2024 ఫిబ్రవరిలో ఏలూరు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, డీపీవో, ఈవోపీఆర్‌డీ, రెవెన్యూ అధికారులు చెరువులో పంట కాల్వ నీటిని నింపుకునే అవకాశానికి దగ్గరగా ఉందని సొసైటీ చెరువులో 5 ఎకరాల సేకరణ చేయడం ఉత్తమమని రిపోర్టు పంపారు. దీంతో పోలీసు, రెవెన్యూ అధికారులు చెరువు మధ్య గట్టును ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. మొత్తం చెరువులో 5 ఎకరాలకు సరిహద్దు రాళ్లను సైతం ఏర్పాటు చేశారు.

ఎన్నికలతో ఆలస్యం..

ఎన్నికలు రావడంతో చెరువు గట్టు ఏర్పాటు చేయటంలో ఆలస్యం జరిగింది. దీంతో గ్రామస్తులు అధికారులు కోర్టు తీర్పును అమలు చేయడం లేదని కోర్టును ఆశ్రయించారు. ఈ నెల 8న పోలీసు, రెవెన్యూ అధికారులు 15 రోజుల్లో గట్టు ఏర్పాటు చేయాలని కోర్టు నోటీసులు పంపింది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం నుంచి రూరల్ సర్కిల్ సీఐ, టౌన్ సీఐలు వి.రవికుమార్, పి.కృష్ణ, మండవల్లి తహసీల్దార్ కె.గోపాల్, మండవల్లి, కైకలూరు రూరల్, కలిదిండి ఎస్ఐలు రామచంద్రరావు, రాంబాబు, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భారీగా పోలీసులు చేరారు. పొక్లయిన్‌తో 5 ఎకరాలకు గట్టును ఏర్పాటు చేయించారు. అదే విధంగా ప్రస్తుతం చెరువులో ఉన్న అడుగు చేపలను సొసైటీ సభ్యులు పట్టుకున్నారు. సీఐ రవికుమార్ మాట్లాడుతూ కోర్టు ఉత్తర్వులను సొసైటీ సభ్యులకు వివరించామన్నారు. ఎటువంటి సమస్య లేకుండా తాగునీటి చెరువు గట్టు ఏర్పాటు చేశామని చెప్పారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత

గుడివాడటౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేసినట్లు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వై.నాగేశ్వరరావు, జి.కిరణ్‌బాబు తెలిపారు. పట్టణానికి చెందిన జె.చందన శరిష్మా అగ్రికల్చరల్ బిఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా కళాశాల ఫీజు నిమిత్తం రూ.33 వేలు చెక్కు అందజేసినట్లు తెలిపారు. క్లబ్ సభ్యులు, గవిర్నేని చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వితరణ అందజేశామన్నారు.

బాబా మందిరంలో అన్నసమారాధన

మండవల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కొలువై ఉన్న బాబా మందిరంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుత బాబావారికి విశేష పూజలు జరిపారు. అన్నసమారాధనలో మండవల్లి, గన్నవరం, కొర్లపాడు, పెరికెగూడెం తదితర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరారవు, పయ్యావుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో బీసీలపై దాడులు పెరిగాయి



కృష్ణాజిల్లా చైర్‌పర్సన్ హారిక దంపతులను పరామర్శిస్తున్న వీరరాజు తదితరులు

కైకలూరు: కూటమి ఏడాది పాలనలో బీసీలపై దాడులు పెరిగిపోతున్నాయని ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు చేబోయిన వీరరాజు మండిపడ్డారు. ఇటీవల గుడివాడ వైఎస్సార్ సీపీ సమావేశానికి హాజరవుతున్న ఉమ్మడి కృష్ణాజిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఆమె భర్త రాము కారుపై జరిగిన దాడి నేపథ్యంలో పెడనలో చైర్‌పర్సన్ దంపతులను నాయకులు గురువారం పరామర్శించారు. పార్టీ నాయకులందరం అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం వీరరాజు మాట్లాడుతూ జిల్లా ప్రథమ పౌరురాలికి భద్రత కరువైతే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఏడాది పాలన సుపరిపాలన అని చెప్పుకుంటున్న కూటమి నేతలు ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతకు భయపడి వైఎస్సార్ సీపీ సమావేశాలకు వెళుతున్న నాయకులను అడ్డుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పార్టీ రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ బలే నాగరాజు మాట్లాడుతూ.. మహిళా ప్రజాప్రతినిధులపై దాడిని అందరూ ఖండించాలన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లింగాల వైఎస్సార్ సీపీ ఎంటీటీసీ కమదన నాయనబాబు, మండవల్లి మండల మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, నాయకులు పరింకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు సారె సమర్పణ



కైకలూరు: ఆషాఢ మాసం సందర్భంగా కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి మహిళా భక్త సమాజం ఆధ్వర్యంలో పలు ఆలయాల్లోని అమ్మవార్లకు ఆషాఢ సారెను భక్తిశ్రద్ధలతో గురువారం సమర్పించారు. స్థానిక శ్యామలాంబ ఆలయంలో పార్వతీమాత, కన్యకా పరమేశ్వరీ ఆలయంలో, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మాతా గోవిందమాంబకు సారెను అందించి ప్రత్యేక పూజలు చేశారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



గన్నవరం: స్థానికంగా ఉన్న ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో గురువారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ డీఎస్పీ బంగారురాజు నేతృత్వంలో ఎరువుల దుకాణాల్లో స్టాక్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎరువులు, పురుగు మందుల విక్రయాలకు సంబంధించి సరైన బిల్లులు లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీకే విక్రయించాలని సూచించారు. స్టాక్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, బిల్లులు సక్రమంగా లేకపోయినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజమండ్రి ఏడీఏ చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. తొలుత స్థానికంగా ఉన్న రెండు ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుల్లో కూడా అధికారులు సోదాలు జరిపారు.